# వాయిదాపడిన పెళ్లి

(కథానిక)

పెళ్లి పందిట్లో చాలా సందడిగా ఉన్నది. పెండ్లివారికి తీరికే లేదు. ఇటూ అటూ తిరుగుతూ అంతా తయారు చేయటంలో అందరూ నిమగ్నులై వున్నారు. లోపల హాలులో ఆహ్వానితులైన రమణులందరూ కూర్చుని ముచ్చట్లాడుతున్నారు. పక్కగదిలో శాంతను పెండ్లికూతుర్ని చేస్తున్నారు. శాంత స్నేహితురాలు పక్కనే కూచుని సరసాలాడుతున్నది. శాంతకు చాల ఆనందంగా ఉన్నది. ఏమంటే తాము ప్రేమించి పెండ్లి చేసుకుంటున్నారు.

బైట వాకిలివైపు గదిలో శాంత తండ్రి అనంతరామయ్యగారు కూర్చుని బ్యాండుమేళం విషయమై ఎవరితోనో సంప్రదిస్తున్నారు. ఆ సమయంలో విశ్వనాథం గారక్కడికి వచ్చి, "అనంతా! అవసరంగా ఒకమాటమాట్లాడాలి. ఇలా లేచిరా!" అన్నారు.

ఆయన ఆదుర్దా చూసేటప్పటికి అనంతంగారికి నోట మాట రాలేదు. ఏదో కొంప మునిగిందనుకొని ఆయన వెంట వెళ్ళారు. ఇద్దరూ తోటలోకి వెళ్ళారు.

"అనంతం! ప్రమాదమైపోయింది. ఈ పెళ్లి ఇప్పుడు జరగటానికి వీల్లేదు" అనంతంగారి గుండె ఒక్కమాటు నిలచిపోయింది. "ఏమీ గాభరా పడకు. నేను జాతకాలు చూచాను. ఈ ముహూర్తానికి పెండ్లి జరిగితే అమ్మాయి ఇంక రెండు సంవత్సరములా యెనిమిది నెలలకు విధవ అవుతుంది. నాది పొరపాటేమోనని వెంకటరమణయ్యగారికి గూడ చూపించినాను. ఆయన అంతా గణనచేసి చెప్పారు. కాబట్టి ఈ ముహూర్తానికిక పెండ్లి జరగడానికి వీల్లేదు.

అనంతంగారికి భూమి లోనికి కృంగిపోతున్నానా అనిపించింది, "అదెలాగ... ఎలాగ" అన్నారు తడబడుతూ.

"ఎలాగేమిటి. అల్లుడిగారి బంధువులకు ఇప్పుడే తెలిపేసెయ్యాలి. ఇంక ఏతతంగమూ జరగదు."

అనంతరామయ్యగారికి దిక్కుతోచలేదు. ఇంత బ్రహ్మాండమైన ప్రయత్నం బూడిదపాలై పోతుంది. నలుగురిలో అభాసైపోతుంది. ఆయన మాట్లాడకుండా కళ్ళు మూసుకు పడుకున్నారు. విశ్వనాథంగారికి ఆయన మానసిక పరిస్థితి అర్థమై తనమీదే భారం వేసుకున్నారు.

అంతకోలాహలమూ చడీచప్పుడూ లేకుండా మాయమైపోయింది. అంతా నిశ్శబ్దం. అనంతరామయ్యకు ఎప్పుడు చీకటి పడిందో ఏమీ తెలియదు. కళ్ళు తెరిచేటప్పటికి పెళ్ళికూతురు ముస్తాబులో శాంత కనిపించింది. వెంటనే ఆయన కనుకొలకులనుండి నీళ్ళు కారాయి. శాంత చప్పున వచ్చి "నాన్నా! ఏమంత బ్రహ్మాండమయిందని ఆవేదనపడతావు? మూడు సంవత్సరాలంటే ఎక్కువా ఏమిటి, ఛీ ఊరుకో నాన్నా" అనింది. కాని ఆమె కంఠస్వరం ఆమె మనోవేదనను దాచలేకపోయింది.

ఆయన "అమ్మా, పైకి ఇలాగంటున్నావు కాని నీకు మాత్రం..."

"అబ్బే, ఏమీలేదు. నా సౌభాగ్యంలో ఎంత రాసిపెట్టి ఉంటే అంతే జరుగుతుంది. నీ వూరుకో నాన్నా!" అని మెల్లగా అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

పెండ్లి కుమారుడు రఘును తల తిరిగిపోయింది ఈ భయంకరమైన విషయం తెలియగానే. కొద్ది రోజులపాటు ఎవరితోనూ మాట్లాడలేదు. తర్వాత మెల్లగా "నాకు ఇంజనీరింగు చదువుకోవాలని వుంది. సీమ వెళ్తాను" అన్నాడు. అతనికివున్నది ఒకే ఒక ఆత్మీయుడు, అది అతని మామ విశ్వనాథం. ఆయన గూడా ఏమీమాట్లాడలేకపోయనాడు. కుర్రవాడిగాయపడిన మనస్సు అలాగైనాఆరనీ అనుకున్నాడు.

రఘు సీమకు వెళ్ళి ఇంజనీరింగుకోర్సు పూర్తి చేసుకున్నాడు. అక్కడక్కడ కొన్ని ప్రదేశాలు చూడవలసి ఉన్నవనీన్నీ ఇంక మూడు మాసాలలో వస్తున్నాననీ అనంతంగారికీ, విశ్వనాథం గారికీ వ్రాశాడు.

ఈ పెళ్ళి శాశ్వతంగా విడిపోయిందనే అందరూ అనుకున్నారు. అనంతంగారు కూడా ఇతర ప్రయత్నాలు చేశారు. కాని శాంతకు ఇది తెలిసి చాలా నొచ్చుకుంది. "నాన్నా! కాకపోయినా, అయినంత అయిందిగదా! నీవు ఇలా చేయడం ఏమీబాగాలేదు నాన్నా" అని మందలించినది. అందువలన అనంతం గారు కూడా ఊరుకోవలసి వచ్చింది.

ఇప్పుడు రఘు వస్తున్నాడనగానే అనంతం గారికి నెత్తిమీదనుండి ఒక పెద్దబరువు దించినట్లయింది. దుఃఖమూ, అభిమానంతో సీమకు వెళ్ళినరఘు మరలవచ్చి, శాంతను చేసుకుంటాడన్న నమ్మిక ఆయనకు లేకుండా ఉండినది. రఘు శాంతను ఎక్కువగా ప్రేమించాడు. శాంతగూడా ఒప్పుకుంది. కాని సమయంలో ఇలాంటి విఘ్నం వచ్చిందేమా అని ఆయనబాధ పడిపోయారు. ఈ నాటికది తీరింది. వెంటనే విశ్వనాథాన్ని రమ్మని జాబు వ్రాశారు.

శాంతకు చిన్నప్పటినుంచీ సంగీత మంటే చాలా అభిమానం ఆమె తన స్వల్ప వయస్సులోనే చాలా సంగీతంవినింది. ఎక్కడ కచ్చేరి అయినా వెళ్ళటం అలవాటు. ఈ సంఘటన జరిగింతర్వాత ఆమె ఎక్కడికీ వెళ్ళటం మానేసింది. కాని క్రమంగా రెండు సంవత్సరాలు గడచేటప్పటికి మామూలు మనిషిఅయింది. కొద్ది రోజులకు పూర్వం టౌన్ హాలు లో మురళీకృష్ణగారి పాటకచ్చేరికి తండ్రితోగూడా వెళ్ళింది. పాట. సాహిత్యం, వలెనే మనిషి గూడ చాలాఅందంగా ఉండటం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. మురళీకృష్ణ అనంతం గారికి పరిచయుడే. అందువలన కచ్చేరి అయిన తర్వాత అతనిని తమయింటికి ఆహ్వానించారు. శాంతముఖం ఆనందాతిరేకంవల్ల వికసించింది.

తన సంగీతంలోని లోటుపాట్లను తెలిసుకోవలెనని ఇచ్ఛ పుట్టింది.

సాయంత్రం మురళీ కృష్ణగారి పాటకచ్చేరి జరిగింది. ప్రపంచంలో అడగడుగునా సంగీతం అందరి హృదయాల్లో వేదన పుట్టిస్తుందన్న సంగతి శాంతకు తెలియదు. అతని గానంలో ఆడంబరంలేని స్థాయీత్వ పద్ధతి, స్వరం స్వచ్ఛంగా తేలిపోతూన్న గతీ, ముఖంమీద నీలి భావాల నీడలూ ఆమె హృదయాన్ని కలచివేసినాయి. రెండు కళ్ళలో కన్నీళ్లు గిర్రున తిరిగినాయి. వాటిని పైకి కనబడ నివ్వక మొహం తిప్పుకుని లేచిపోయింది.

అనంతరామయ్య భాగ్యవంతుడు. దినదినం ఇంట్లో ఏదో ఒక వేడుక జరుగుతూండేది. దానికి అందరినీ ఆహ్వానిస్తూండడం పరిపాటి. ఇప్పుడు మురళీ కృష్ణగారిని ఆయన విడిచిపెట్టలేదు. శాంత ఎప్పుడూ సంగీత విమర్శనలోనే తేలుతూ మునుగుతూ ఉంది.

అప్పుడు రఘు తిరిగివచ్చాడు. అతడు మొదట విశ్వనాథంగారి వద్దకు వెళ్ళి ఆయన ఆశీర్వచనం పొందాడు. ఇద్దరూకలిసి అనంత రామయ్యగారి ఇంటికివచ్చారు. ఇది శాంతకు ఎంతో ఆనందకరమైన సంగతి. సాయంత్రం అందరూ అలా షికారువెళ్ళవద్దా మనుకున్నారు. షికారుకు తయారయి వచ్చిన శాంతను చూచి విశ్వనాథం నిశ్చేష్టుడయ్యాడు. అతి సామాన్యమైన బట్టలువేసుకుంది. ఆనందంలోని ఆడంబరం ఎక్కడా వ్యక్తం కావడంలేదు. కళ్ళను యేదో క్లాంతిచ్ఛాయ మలినపరచింది. ఆమె ముఖంలో ఆనంద దీప్తి తాండవ మాడుతూంటుందనుకున్నాడు. అంతా విపర్యంగా ఉన్నది. కాని రఘుయొక్క నిర్మలమైన ప్రేమమయ హృదయానికి ఇవి ఏమీ అగుపడలేదు.

కొద్ది రోజుల తర్వాత జరిగిన సంఘటన రఘు జీవితాన్ని తారుమారు చేసింది. ఆ రోజు రఘు ఏదో పిక్చరుకు వెళ్ళాడు. వచ్చే త్రోవలో ఒకరిద్దరు స్నేహితులు కనపడ్డారు. అందువలన ఇంటికొచ్చేటప్పటికిఅర్ధరాత్రిదాటింది. అనంతం గారూ విశ్వనాథంగారూ కళ్ళలో ఒత్తులు వేసుకొని కూర్చునివున్నారు. ఇతన్ని చూడగానే "ఏంనాయనా! ఇంతఆలస్యమైంది?" అన్నారు.

రఘు సిగ్గుపడి "పిక్చరుకు వెళ్ళి వస్తూంటే స్నేహితులు అగుపడ్డారు" అన్నాడు.

రఘు బట్టలు మార్చుకొని శాంత గదివైపు

వెళ్ళాడు. గదిలో లైటు వేసిఉంది. శాంత లేదు. ఇంతలో ప్రక్కన చెట్లగుబురులో నుండి మాటలు వినిపించాయి. అలా చూచాడు. మసక వెన్నెలలో పామ్ చెట్లు ప్రక్కన ఉన్న తిన్నెమీద ఒకరు కూర్చుని ఉన్నారు. రెండవ వ్యక్తి మొదటి వ్యక్తి ఒడిలో పండుకొని ఉన్నారు. రెండూ పరిచిత కంఠాలే. విషయ మేదో కాదు. ఏదో సంగీత స్వరాన్ని గురించి. మెల్లిగా తన గదిలోకి వెళ్ళాడు. ఒక గంట యిన తర్వాత శాంత వచ్చింది.

"బలే. ఇంతసేపు ఎక్కడికి వెళ్ళారు? మా కళ్లు కాయలు కాచిపోయినవి. భోం చేస్తారా?" అంది శాంత.

"నా కాకలిగా లేదు. నీవు వెళ్ళి భోంచెయ్యి" అని రఘు ఇవతలికి వచ్చేశాడు. శాంత నిశ్చేష్ట రాలైంది. ఇంకొక సమయంలో గనక అయితే బతిమాలి తన పంతం నెగ్గించుకొనేది. కాని ఇప్పుడాశక్తి ఆమెలో లేదు. ఇంకేమి మాట్లాడ డానికి గూడా ఎవరో ఆమె గొంతు నొక్కి వేసినట్లయింది. చాలాసేపు నిల్చుకొని వెళ్ళి పోయింది.

రెండుమూడు రోజుల వరకు రఘు వింత ప్రవర్తన అందరికీ బాధ కలిగించింది. శాంత గూడా ముభావంగా ఉంటూఉంది. ఇది అందరూ గమనించారు. తర్వాత ఒకరోజు విశ్వనాథంగారు ముహూర్త ప్రస్తావన చేసే టప్పటికి రఘు గాభరాపడి "వద్దు మామయ్యా! కొన్ని రోజులనుండి మీకు చెప్పాలనుకుంటూ న్నాను. నాకు పెండ్లి చేసుకోవటాని కిష్టం లేదు. నన్ను బాధించకండి" అన్నాడు.

విశ్వనాథం ఆశ్చర్యపోయి "ఇదేమిటిరఘూ, ఇంత జరిగింతర్వాత ..."

"లేదు మామయ్యా! నాకిష్టంలేదు, అంతే" అని మొహం తిప్పుకొని వెళ్ళిపోయాడు.

విశ్వనాథానికిదేమీ అర్థంకాలేదు.

ఒకరోజు మెల్లగా అనంతరామయ్యతో అన్నాడు. ఇది విని ఆయన దిగ్భ్రమజెందాడు. తర్వాత విశ్వనాథమే మొదట మాట్లాడాడు.

"కొద్దిరోజులనుండే వాళ్లిద్దరూ ముభావంగా ఉంటూన్నారు. ఎందువల్లనో తెలియటంలేదు. ఇద్దరిమధ్య కీచులాట యేమైనా ..."

అనంతరామయ్యకు నోటమాట రాలేదు. రఘు చాలనెమ్మదిమనిషి, నిజాయితీకలవాడు. అతనిలో ఒక విధమైన సత్యపరతఉన్నది. ఇది లాగు సంభవించినది? దీనికి సమాధానమే దొరకలేదు. కాని ఈ సమస్య విచిత్రంగా పరి ష్కారమైపోయింది. మురళీ కష్ణకు జబ్బు చేసింది. మందూమాకూ అనంతంగారే చేయి స్తున్నారు. ఒకరోజు సాయంత్రం అనంతం గారూ, రఘూ మాట్లాడుతూ ఆ గదివైపు వెళ్ళారు. అక్కడి దృశ్యం చూసేటప్పటికి ఇద్దరి కళ్ళూ చీకట్లు కమ్మాయి. ఒక కుర్చీలో శాంత నిద్రభారంవల్ల గాబోలు తలను రోగి హృదయంమీద పెట్టివుంది. అతని రెండు చేతులూ ఆమె మెడను పెనవైచుకొనివున్నయ్.

మరుసటి దినమే రఘు అక్కడినుండి వెళ్ళి పోయాడు. అనంతరామయ్యగారి ఒత్తిడివల్ల మురళీ కృష్ణ వేరే బస చూసుకోవలసివచ్చింది. మొదట శాంత అందుకు ఒప్పుకోలేదు. కాని తప్పలేదు.

కొన్ని రోజులు గొర్లిపోయాయి. వేదనతో అభిమానంతో రఘు గుండె పగిలి పోయింది. అతడు ఆమెను హృదయ పూర్వ కంగా ప్రేమించాడు. పెండ్లికి విఘ్నం వచ్చినా కూడా అధైర్యపడలేదు. సీమనుంచి వచ్చేటప్పుడు ఎంతో ఆశతో వచ్చాడు. అంతా తారుమా రయివుంది. అతనికి ఈ ప్రపంచమే శూన్యమని పించింది. ఇంక ఈవాతావరణంలో ఉండటానికి మనసొప్పలేదు. ఎవరికీ చెప్పకుండా ఒకరోజు ఇంగ్లండుకు వెళ్ళిపోయాడు.

అనంతరామయ్యగారికి సుతరామూ ఇష్టం లేకపోయినా విశ్వనాథంగారి బలవంతం వల్ల మురళీ కృష్ణతో శాంత పెళ్ళికి ఒప్పుకోవలసి వచ్చింది.

పెండ్లి వాయిద్యాలు మ్రోగుతున్నాయి. అనంతంగారి హృదయంలో సమ్మెటపోట్లు! ఆయనకు ఒక్కక్షణం రఘు నిర్మలప్రేమ, అతను పొందిన బాధ జ్ఞాపకంవచ్చాయి. ఆనాడు అతని సజలనేత్రాలలోని వ్యథను అర్థం చేసుకోలేక పోయాడు. ఈనాడు తాను అంతకన్నా బాధ పడుతూన్నాడు.